క్లుప్తంగా

ఘనంగా బోనాలు



బోనాలతో మహిళలు

మందమర్రిరూరల్: పట్టణంలోని దీపక్‌నగర్‌లో గల పోచమ్మతల్లికి బుధవారం బోనాల వేడుక ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని శాకాంబరీ అవతారంలో అలంకరించి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నామని ముత్తయ్య, రామయ్య, రమేష్, సంపత్, వాసుదేవన్, శ్రీకాంత్, మని తదితరులతో పాటు దీపక్‌నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇందారంలో ఎల్లమ్మతల్లికి...

జైపూర్: మండలంలోని ఇందారం గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎల్లమ్మతల్లికి బోనాలు పోశారు. ఏటా ఆశాఢమాసంలో ఎల్లమ్మతల్లికి బోనాలు పోయడం ఆనవాయితీగా వస్తుందని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు సంవృద్ధిగా పండాలని కోరుతూ ఎల్లమ్మతల్లికి మొక్కులు చెల్లించారు.

తాండూర్ పశువైద్యాధికారిగా పీవీ నరసింహారావు



తాండూర్: తాండూర్ పశువైద్యాధికారిగా పీవీ నరసింహారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో తాండూర్ మండలంలోని రేచిని పశువైద్యాధికారిగా పనిచేసిన పీవీ నరసింహారావు ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా తాండూర్ పశువైద్యశాలకు బదిలీపై వచ్చారు.

ఆటో డ్రైవర్ల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేయాలని బెల్లంపల్లి ఆటో యూనియన్ అధ్యక్షుడు కె.రామ్‌కుమార్ కోరారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్ల పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. గిరాకీ లేక అనేక మంది డ్రైవర్ల బ్రతుకులు వీధిన పడ్డాయని తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిశీలించి, న్యాయం జరిగేలా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో సోమగూడెం ఆటో యూనియన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ఆటో జేఏసీ నాయకుడు ఎండీ ముక్త్యార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ఏఐటీయూసీలో చేరిన టీచర్లు, ఆయాలు

కోటపల్లి: అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి మేకలదాసు డిమాండ్ చేశారు. దేవులవాడలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.18వేలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంగ్రెస్ మేనిఫెస్టోలో అసెంబ్లీలో ప్రకటించిన విధంగా రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.1లక్ష ఇచ్చే విధంగా ప్రభుత్వం జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు ఆయాలకు ఏఐటీయూసీ యూనియన్ ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లను, ఆయాలను పార్టీలోకి ఆహ్వానించి కండువా వేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఖలీందర్ ఖాన్, ఉపాధ్యక్షుడు పాల్, నాయకులు నెన్నల సమ్మయ్య, ఇందిరా, ప్రశాంతి, రాజేశ్వరి, శ్రీలత, విజయలక్ష్మి, సత్యవతి, సునంద, విమల, పద్మ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

భీమారం/తాండూర్: భీమారం మండలంలోని పోలంపల్లి గ్రామంలో పారిశుధ్య పనులను ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్, తాండూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఎంపీడీవో, ప్రత్యేక అధికారి శ్రీనివాస్ పారిశుధ్య పనులను బుధవారం పరిశీలించారు. చెత్తా చెదారం పేరుకపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

నిలదీతలు.. నిరసనలు

- గరంగరంగా క్యాతనపల్లి మున్సిపల్ సమావేశం
- సమస్యలపై నిలదీసిన కౌన్సిలర్లు
- కౌన్సిల్ ఆమోదం పొందకుండానే బిల్లుల మంజూరుపై తీవ్రఆగ్రహం
- కమిషనర్ తీరును నిరసిస్తూ సభ్యుల వాకౌట్



సమస్యలపై నిలదీస్తున్న కౌన్సిలర్లు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపల్ సమావేశం వాడీవేడిగా సాగింది. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించటంలో కమిషనర్ సరిగ్గా స్పందించటం లేదంటూ కౌన్సిలర్లు నిలదీశారు. కౌన్సిల్ ఆమోదం పొందకుండా ఇంజినీరింగ్ పనులకు సంబంధించిన బిల్లులను ఎలా మంజూరు చేస్తారని పేర్కొంటూ సమావేశాన్ని కొద్దిసేపు బహిష్కరించారు. వివరాల్లోకి వెళ్తే.. క్యాతనపల్లి మున్సిపాలిటీ సాధారణ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే రసాభాసగా మారింది. కౌన్సిల్ సభ్యుల ఆమోదం లేకుండా ఇంజనీరింగ్ పనులకు సంబంధించిన రూ.4లక్షల 18వేల బిల్లులు ఎలా మంజూరు చేసుకుంటారంటూ అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణను ప్రశ్నించారు. ప్రధానంగా ఇదే విషయమై అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లంతా కమిషనర్‌ను నిలదీసే ప్రయత్నం చేశారు. అయితే కమిషనర్ నుంచి సరైన సమాధానం రాకపోవడంతో సమావేశం నుంచి వాకౌట్ చేస్తూ అందరు కౌన్సిలర్లు బయటకు వచ్చేశారు. కార్యాలయ ఆవరణంలోనే కమిషనర్ తీరుకు వ్యతిరేకంగా పలువురు నిరసన తెలిపారు. కొద్దిసేపటికి కమిషనర్ వచ్చి సర్దిచెప్పే ప్రయత్నం చేయగా, మళ్లీ కౌన్సిలర్లందరూ సమావేశానికి హాజరయ్యారు. అయితే కమిషనర్ తీరుపై నిలదీతలు మాత్రం ఆగలేదు. తమ వార్డులో రోడ్డుపైనే నీరు నిలిచి ఇబ్బందిగా మారిందంటూ గత కొద్ది రోజులుగా కమిషనర్ దృష్టికి తీసుకొచ్చినా సమస్య పరిష్కారానికి ఎలాంటి చొరవ చూపటం లేదంటూ 7వ వార్డు కౌన్సిలర్ పొలం సత్యం మండిపడ్డారు. ప్రతీ వార్డుకు రూ.5లక్షల జనరల్ ఫండ్ నిధులు మంజూరు చేస్తామని గతంలో చెప్పినప్పటికీ ఎందుకు మంజూరు చేయటం లేదని 21వ వార్డు కౌన్సిలర్ పార్వతి విజయ ప్రశ్నించారు. కేవలం అధికార పార్టీకి చెందిన వారి వార్డులకే పనులన్నీ కేటాయిస్తున్నారని, గతంలో ఇలా ఎప్పుడు లేదని 5వ వార్డు కౌన్సిలర్ జిలకర మహేష్ పేర్కొన్నారు. సమస్యలపై తాము ఫిర్యాదులు చేస్తే పట్టించుకోని కమిషనర్ వేరే ఎవరో నాయకుడు చెప్తే మాత్రం స్పందిస్తున్నారని మరో కౌన్సిలర్ మండిపడ్డారు. వేలాది సంఖ్యలో జనం వచ్చే గాంధారి మైసమ్మ జాతర కోసం ఆలయం వద్ద పారిశుధ్య పనులు చేపట్టాలని కౌన్సిలర్‌గా తాను చెప్తే కనీస స్పందన లేకుండా ఎలా వ్యవహరిస్తారని 9వ వార్డు కౌన్సిలర్ తిరుపతి తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఇలా ఒకొక్కరుగా సమస్యలను లేవనెత్తడంతో పాటు అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో సమావేశ మందిరం గందరగోళంగా మారింది. మున్సిపల్ చైర్‌పర్సన్ సైతం సమస్యలపై ఎలాంటి పట్టింపులు లేకుండా వ్యవహరిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు. అయితే బుధవారం నాటి సమావేశంలో 12అంశాలతో కూడిన ఎజెండాను ప్రతిపాదించినప్పటికీ కౌన్సిలర్లు ఎవరూ కూడా ఆమోదం తెలుపలేదు. దీంతో అర్ధాంతరంగానే సమావేశం ముగిసింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, ఏఈ అచ్యుత్ పాల్గొన్నారు.



వాకౌట్ చేసి నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు

వాడీవేడిగా చెన్నూర్ మున్సిపల్ సమావేశం

- పబ్లిక్ టాయిలెట్ ఎందుకు ప్రారంభించలేదన్న సభ్యులు
- ఎన్విరాన్మెంట్ అధికారికి వేతనం పెంపు తీర్మానం తిరస్కరణ
- సక్రమంగా నిర్వహించని ఎస్సీ సబ్ ప్లాన్ పనులు



ఎజెండా చదువుతున్న మేనేజర్

చెన్నూర్: మున్సిపాలిటీ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనగిల్డా అధ్యక్షతన బుధవారం వాడీవేడిగా సాగింది. మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధి పనులపై అధికారులను సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. మున్సిపల్ వార్డు ఆఫీసర్ శ్రావణ్ ఎజెండాను చదివి విన్పించారు. మున్సిపాలిటీలో రూ.4.27లక్షల నిధులతో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్‌ను ఎందుకు ప్రారంభించలేదని బుధవారం 'సాక్షి'లో వచ్చిన కథనాన్ని కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ కమిషనర్‌ను ప్రశ్నించారు. ప్రస్తుతం ఖర్చు పెట్టిన నిధులతో పనులు పూర్తి కాలేదని, సాధారణ బడ్జెట్ నుంచి నిధులు కేటాయించి పనులు పూర్తి చేసి పబ్లిక్ టాయిలెట్స్‌ను ప్రారంభిస్తామని సమాధానం ఇచ్చారు. ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ హరికాంత్‌కు గతంలో రూ.16.500 వేతనం ఇచ్చినట్లు, ఇంజనీర్ విధుల కాల పరిమితి ఇటీవల ముగిసింది. ఈ ఏడాది 1జూలై నుంచి 30జూన్ 2025వరకు పునరుద్ధరించి వేతనం రూ.40,250 వేతనం పెంచుటకు పరిపాలన పరమైన తీర్మానానికి ఆమోదం తెలుపాలని మేనేజర్ ఎజెండాను సభ్యుల ముందు ఉంచారు. ఈ ఏడాది నర్సరీలో మొక్కలు పెంపకం జరగలేదు. వన మహోత్సవం సందర్భంగా అటవీ శాఖ నుంచి మొక్కలు తీసుకొచ్చారు. మొక్కల పెంపకమే లేనప్పుడు ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ అవసరామా అని 1వ, 2వ వార్డుల కౌన్సిలర్లు కమ్మల శ్రీనివాస్, పోగుల సతీశ్‌లు ప్రశ్నించారు. మున్సిపాలిటీలో నిధులు కొరత ఉన్న సమయంలో వేతనం పెంచే తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు కౌన్సిలర్లు తెలిపారు. దళిత వాడ అభివృద్ధిలో భాగంగా గతంలో రూ.92లక్షలు మంజూరు కాగా పనులు సక్రమంగా జరగలేదని కౌన్సిలర్ మహేశ్ ప్రశ్నించారు. ఏఈ సెలవులో ఉన్నారని విధుల్లోకి వచ్చిన తర్వాత అడిగి తెలుసుకుంటామని కమిషనర్ గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ అర్చనలాల్ గిల్డా, కమిషనర్ గంగాధర్‌లు మాట్లాడుతూ.. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణ కోసం, మిషన్ భగీరథ పైపు లైన్ల లీకేజీల మరమ్మతులు, బోరు పంపుల మరమ్మతుల కోసం పలు తీర్మానాలు ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల ముందస్తు అరెస్టు

బెల్లంపల్లి: సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌లో జరిగే ధర్నాకు వెళ్లేందుకు సిద్ధమైన హమాలీలను బుధవారం తెల్లవారుజామున పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. బెల్లంపల్లి సివిల్ సప్లయ్ విభాగంలో పని చేస్తున్న హమాలీలు విజ్జగిరి చంద్రశేఖర్, ఉజ్జాతుల రమేష్‌లను టూటౌన్ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అరెస్టును సంఘం బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఖండించారు.

ఎజెండా అంశాలపై ఏకగ్రీవ తీర్మానం

- సాదాసీదాగా బెల్లంపల్లి మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్వేత

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం సాదాసీదాగా జరిగింది. మున్సిపల్ కార్యాలయం సమావేశం మందిరంలో చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అధ్యక్షన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎజెండా అంశాలపై చర్చించి సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కొత్తగా నిర్మించిన కూరగాయల మార్కెట్‌లో స్త్రీ, పురుషుల కోసం వేర్వేరుగా టాయిలెట్లు నిర్మించాలని, కూరగాయల మార్కెట్‌లో వర్షం నీరు నిలువకుండా షెడ్డు నిర్మించాలని, 2023-24ఆర్థిక సంవత్సరంలో తాగునీటి పథకం కింద గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు తాగునీటి సరఫరా కోసం స్కీం అసిస్టెంట్ 2024 అభివృద్ధి పథకాల కింద మంజూరు చేసిన రూ.15.14లక్షల వినియోగం కోసం తీర్మానం చేశారు. మున్సిపాలిటీలో డెంగీ, మలేరియా జ్వరాలు ప్రబలకుండా స్ప్రే, బ్లీచింగ్ ఫౌడర్ చల్లించాలని, శానిటేషన్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సభ్యులు ప్రతిపాదించి ఆమోదించారు. కాగా రాములునాయక్, చంద్రశేఖర్, కృష్ణ, అశోక్ తదితర సభ్యులు పురప్రజలు ఎదుర్కొంటున్న, వార్డుల్లోని సమస్యలపై మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, చైర్‌పర్సన్ శ్వేతను నిలదీశారు. మున్సిపాలిటీకి నిధులు మంజూరవుతున్నా అభివృద్ధి కనిపించడం లేదని, నిధులు ఏ వార్డుల్లో ఖర్చు చేస్తున్నారో తెలియకుండా ఉందని సభ్యులు పేర్కొన్నారు. 34వార్డులకు సమంగా నిధులు కేటాయించడం లేదని, ఈ వివక్ష ఎందుకని ప్రశ్నించారు. ఎప్పటి మాదిరిగానే ఈసారి కూడా సమావేశం మొక్కుబడిగా జరిగింది. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కాసిపేట: మండలంలోని సోమగూడెం లంబాడి తండాలో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్(కార్డన్ సెర్చ్) నిర్వహించారు. ఆధార్‌కార్డులు పరిశీలించారు. వాహనాల పత్రాలు పరిశీలించి సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించడంతో పాటు ప్లకార్డులు ప్రదర్శింప జేసి అవగాహన కల్పించారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ హాజరై మాట్లాడుతూ అనుమానాస్పదంగా ఎవరు కనిపించినా, పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వాహన పత్రాలు సక్రమంగా ఉంచుకోవడంతో పాటు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందిగా సూచించారు. ఎవరైనా భూవివాదాలలో మోసం చేయాలని చూసినట్టైతే క్రిమినల్ కేసులు రౌడీషీట్‌లు ఓపెన్ చేయనున్నట్లు హెచ్చరించారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ప్రస్తుతం అవగాహనతో పాటు నివారణకు కృషి చేస్తున్నామని మత్తు పదార్థాల వినియోగం, క్రయ విక్రయాల్లో భాగస్వాములు అయితే కఠినచర్యలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా పత్రాలు సక్రమంగా లేని 35ద్విచక్ర వాహనాలు, 3ఆటో రిక్షాలను సీజ్ చేసినట్లు తెలిపారు. మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, కాసిపేట, దేవాపూర్ ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులుతో పాటు మందమర్రి, బెల్లంపల్లి టూటౌన్ ఎస్సైలు, 40మంది పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మొక్కలను సంరక్షించుకుందాం

చెన్నూర్: మొక్కలతోనే మావన మనుగడ ముడిపడి ఉందని, నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించుకుందామని మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనగిల్డా అన్నారు. స్థానిక పదో వార్డులో వన మహోత్సవాన్ని నిర్వహించారు. వార్డులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రాముని చెరువు వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలను పంపిణీ చేశారు.

పౌరహక్కుల దినోత్సవం

దండేపల్లి: మండలంలోని ధర్మరావ్‌పేటలో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. అంటరానితనం నిర్మూలన, కులవివక్ష, వంటి వాటిని గురించి చర్చించడంతో పాటు, పౌర హక్కులను గురించి ఆర్ఐ బొద్దుల భూమన్న వివరించారు.

జన్నారం: పౌరహక్కులు, వాటి చట్టాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. కలమడుగు రైతు వేదికలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా పలు అంశాల గురించి వివరించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

మంచిర్యాలటౌన్: వర్షాలు కురుస్తున్నందునా సీజనల్ వ్యాధులు ప్రబలేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సులేమాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 5, 18వ వార్డులకు సంబందించి మజీద్‌వాడలో బుధవారం మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు సుదమల్ల హరికృష్ణ, అఫీజ సుల్తానా, ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సౌజన్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మేనేజర్‌కు బీఎంఎస్ సన్మానం

శ్రీరాంపూర్: సేఫ్టీలో జాతీయస్థాయి అవార్డు సాధించిన సందర్భంగా ఆర్కే 5గని అధికారులు మేనేజర్ అబ్దుల్ ఖాదర్, సేఫ్టీ అధికారి శివయ్య, వర్క్ మెన్ ఇన్‌స్పెక్టర్ చందా ప్రవీణ్‌లను బీఎంఎస్ నాయకులు బుధవారం సన్మానించారు.

తపాలా సేవలు వినియోగించుకోవాలి

జన్నారం: తపాలాశాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల సేవలు అందిస్తున్నామని ప్రజలు గమనించి సేవలను వినియోగించుకోవాలని మంచిర్యాల పోస్టల్ సబ్ డివిజన్ ఏఎస్పీ రాథోడ్ రామారావు అన్నారు. మండల కేంద్రంలోని పొనకల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోస్టాఫీసులో చిన్న మొత్తాల పొదుపు ప్రారంభిస్తే భవిష్యత్ భాగుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఒకే రోజు 213ఖాతాలు తెరిచినట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

భీమారం: మండలంలోని పోలంపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న బాలమృతంను పరిశీలించారు. పౌష్టికాహారం సక్రమంగా అందించాలని అంగన్‌వాడీ టీచర్ రమాదేవిని ఆదేశించారు.

ప్రతీ ఉద్యోగి జీవితంలో విరమణ తప్పనిసరి

- కలెక్టర్ కుమార్ దీపక్



ఉద్యోగిని సన్మానిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్



జైపూర్: రామశాస్త్రిని సన్మానిస్తూ...

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజలతో మమేకమై సేవలందించే ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టర్ కారు డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ పొందిన మహమ్మద్ వలీ దంపతులను కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి శాల్వ, జ్ఞాపికలతో సన్మానించారు. కలెక్టరేట్ ఏవీ పిన్న రాజేశ్వర్, వివిధ శాఖల పర్యవేక్షకులు సంతోష్, మధుసూదన్, సతీష్‌కుమార్, రాఘవేంద్రరావు, అరవింద్ కుమార్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ డిపోలో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను బుధవారం డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగులు రాజయ్య,(ఏడీసీ)బిక్షపతి, రాజేశంలను డీఎం జనార్దన్ సన్మానించారు. ఆర్టీసీ లక్ష్యోలక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం డిపోలో మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన ఉద్యోగులకు ప్రశంసపత్రాలు అందజేశారు. అసిస్టెంట్ డిపోమేనేజర్ దేవపాల, ఎంఎఫ్ సధాకర్ పాల్గొన్నారు.

రామశాస్త్రికి సన్మానం

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పర్సనల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందుతున్న లొల్లి రామశాస్త్రికి ఎస్టీపీపీ బీఎంఎస్ యూనియన్ ప్రధానకార్యదర్శి దుస్స భాస్కర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. అడ్మిన్ భవన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, జీఎం శ్రీనివాసులు నేతృత్వంలో అధికార, ఉద్యోగుల బృందాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో ఏజీఎంలు కెఎస్ఎన్.ప్రసాద్, సుధాకర్, రమణ, మదన్‌మోహన్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సత్యనారాయణ, సీఎంవోఏఐ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, ఎస్‌వోటూ సీటీసీ ప్రభాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ ఎంపీపీ కార్యాలయ సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ చారి, సీనియర్ అసిస్టెంట్ సతీశ్, సబ్ ఆర్డినేట్ ముక్తార్, రాజశేఖర్, శ్రీనులతో పాటు పలువురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ కాగా డీఈవో యాదయ్య, ఎంపీడీవో మధుసూదన్, తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే తదితరులు వారిని సన్మానించారు. కొత్తగా వచ్చిన వారికి స్వాగతం పలికారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

శ్రీరాంపూర్: ఆర్కే 6గనిలో రిటైర్డ్ అయిన ఉద్యోగులను బుధవారం మేనేజర్ ఈ. తిరుపతి సన్మానించి వీడ్కోలు పలికారు. కంపెనీ నుంచి చెల్లించే టర్మినల్ బెనిఫిట్స్ పే ఆర్డర్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గని రక్షణ అధికారి కాదాసి శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి రాంనర్సయ్య, అధికారులు మహేష్, శరత్, శ్రీనివాస్ పిట్ సెక్రెటరీ సంఘం సదానందం, నాయకులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న కార్యదర్శికి సన్మానం

నెన్నెల: మండలంలోని గొల్లపల్లి పంచాయతీ కార్యదర్శి రంజిత్ బదిలీపై వెళ్తుండటంతో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందూరి రమేష్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగరీత్యా బదిలీ సహజమే..

మంచిర్యాలఅర్బన్: ఉద్యోగరీత్యా బదిలీలు సహజమేనని మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి అన్నారు. డిగ్రీ కళాశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న 11మంది అధ్యాపకులకు బుధవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో వారిని సన్మానించారు.

వీడ్కోలు సమావేశం

బెల్లంపల్లి: ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సర్వసాధారణమని బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ, ఏసీపీ ఏ.రవికుమార్ అన్నారు. బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీఓఈ) కళాశాల ప్రిన్సిపాల్ మంగళపల్లి శ్రీనివాస్ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. మాజీ ప్రిన్సిపాల్ సైదులు, ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ గుణకు న్యాయరత్న అవార్డు

మందమర్రిరూరల్: పట్టణానికి చెందిన ఎంపీ గుణ అడ్వకేట్‌కు జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి న్యాయరత్న అవార్డు ప్రకటించింది. హైదరాబాద్‌లోని అడ్వకేట్ ఛాంబర్లో బుధవారం జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు సహెరాభాను, పౌరహక్కుల ప్రజా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవింధ్యాల గుణకు అవార్డు ప్రదానం చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

జైపూర్: మండలంలోని ఇందారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవ్వతాతలకు ఉత్తరాలు రాద్దాం రండి పోస్టర్లను ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు.

పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు

దండేపల్లి: మండలంలోని గూడెం, రెబ్బనపల్లి, వెల్గనూర్, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, కొండు జనార్దన్, అప్పాల మనోహర్ మాట్లాడారు. సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ముందస్తు అరెస్టు

దండేపల్లి: బీజేపీ మహిళ మోర్చ ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్లకుండా దండేపల్లి మండల మహిళా మోర్చ అధ్యక్షురాలు అక్కల దివ్యను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు రక్షణ కల్పించని ప్రభుత్వం ఇలా ముందస్తుగా అరెస్టులు చేయడం శోచనీయం అన్నారు. అరెస్టులకు భయపడేది లేదన్నారు.

'ధర్మదీక్ష' పోస్టర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న ఢిల్లీలో మాదిగ సంఘాల మహా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించే ధర్మదీక్ష పోస్టర్లను మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల శ్రేణులు, మాదిగ సంఘాల నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, టీపీసీసీ సభ్యుడు శంకర్, మున్సిపల్ కౌన్సిలర్లు రాజలింగు, బి.విజయ, ఎస్ ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్ వర్ధన్ రాజు, మాదిగ సంఘాల మహాకూటమి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యావలంటీర్ నియామకం

నెన్నెల: మండలంలోని కోణంపేట ప్రాథమిక పాఠశాలలో కేపీఎల్ ఫౌండేషన్ సంస్థ సభ్యులు బుధవారం విద్యావాలంటరీని నియమించారు. ప్రాథమిక పాఠశాలలో ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారు. గ్రామస్తులు పక్షం రోజుల క్రితం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. స్పందించిన కేపీఎల్ ఫౌండేషన్ వారు నెలకు రూ.6వేల గౌరవ వేతనం ఇస్తూ వాలంటరీని నియమించినట్లు చెప్పారు.

వినతిపత్రం అందజేత

మందమర్రిరూరల్: ఏరియాలోని సులభ్ కాంప్లెక్స్ వద్ద పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్‌కు నాయకులు వినతిపత్రం అందించారు.

సైన్స్‌పై అవగాహన

తాండూర్: సైన్స్‌పై విద్యార్థులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సైన్స్ అధికారి మధుబాబు సూచించారు. మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం విద్యార్థినులకు సైన్స్‌పై అవగాహన కల్పించారు.



రోడ్డుపై నడిచేదెలా?

దండేపల్లి: మండలంలోని సామగూడ గిరిజన గ్రామానికి వెళ్లే రోడ్డు కడెం ప్రధాన కాల్వ సమీపంలో బురదమయం అయ్యింది. గిరిజనులు దండేపల్లికి రావాలంటే బురద రోడ్డును దాటేందుకు నానా అవస్థలు పడుతున్నారు. బురద రోడ్డుపై మొరం పోయించి, కష్టాలు తీర్చాలని గిరిజనులు కోరుతున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల: 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల: సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి: సంపత్ - 7036227114
చెన్నూర్: సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899